సాక్షి కామారెడ్డి
ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



శ్వేతపత్రం విడుదల చేయాలి

డబుల్ బెడ్‌రూం ఇళ్లపై బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ నేత రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

- 9లో ▸



డ్రైవింగ్‌లో అప్రమత్తంగా..

వాహనాలు నడిపే సమయంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీటీవో వాణి సూచించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.4 /18.5

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. రాత్రి ఉష్ణోగ్రతల్లో మార్పులు ఉండకపోవచ్చు.

న్యూస్‌రీల్

డైట్‌సెట్ అభ్యర్థులకు మరో అవకాశం

కామారెడ్డి అర్బన్: డీఈఈసెట్ 2023–25 బ్యాచ్ డీఈఐఈడీ, డీపీఎస్‌ఈలో ప్రవేశాల కోసం గతంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకాని వారు ఈనెల 14న నిజామాబాద్ డైట్ కళాశాలలో మరోసారి హాజరయ్యే అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసుకున్న వారికి ఈనెల 15, 16, 17 తేదీల్లో డీఈఈసెట్ వెబ్‌సైట్‌లో వెబ్ ఆప్షన్ ఇవ్వవచ్చని, 23వ తేదీ నుంచి 26 వరకు అలాట్‌మెంట్ పొంది అడ్మిషన్లు పొందవచ్చని ఆయన వివరించారు. అలాట్‌మెంట్ పొందిన వారు ఈనెల 28న లోగా జాయిన్ కావాల్సి ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

జాతీయస్థాయి డిస్కస్‌త్రోలో పీఈటీకి రజత పతకం



ఎల్లారెడ్డి: మండలంలోని మత్తమాల జెడ్పీ పాఠశాలకు చెందిన పీఈటీ సతీశ్‌రెడ్డి జాతీయస్థాయి డిస్కస్‌త్రో పోటీల్లో రజత పథకం సాధించినట్లు పాఠశాల సిబ్బంది శనివారం తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో సతీశ్ రెడ్డి డిస్కస్‌త్రో విభాగంలో రజత పథకం సాధించారన్నారు. పథకం సాధించిన పీఈటీని ఉపాధ్యాయులు అభినందించారు.

దళిత మహిళపై దాడి బాధాకరం


- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ భక్కి వెంకటయ్య



కామారెడ్డి టౌన్: రామారెడ్డి మండలం ఇస్సన్నపల్లిలో దళిత మహిళపై జరిగిన దాడి దుర్మార్గమైన చర్య అని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ భక్కి వెంకటయ్య అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. మహిళను వివస్త్రగా చేసి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఘటనపై పోలీసులు పూర్తిగా దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించి బాధితురాలికి ఉపాధి కల్పించే విధంగా చేస్తామన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రంలో బాధిత మహిళతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నేనావత్ రాంబాబు నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేంకుమార్, అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల బాబు, తెలంగాణ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుసేగం భూమయ్య, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు బాలరాజ్, ఎమ్మార్పీఎస్ నాయకురాలు లక్ష్మి పాల్గొన్నారు.

నేడు ఫిర్యాదు పెట్టెల ప్రారంభం

కామారెడ్డి టౌన్: ప్రజలు తమ సమస్యలను తెలిపేందుకు పట్టణంతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలను ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆదివారం ప్రారంభించనున్నారు. పట్టణంతో పాటు ఇసాయి పేట్, చుక్కాపూర్, జనగామ, దోమకొండ, పెద్దమల్లారెడ్డి, తలమడ్ల, చిన్న మల్లారెడ్డిల లో ప్రారంభిస్తారు.



ఆరు గ్యారంటీల హామీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఈ పథకానికే తొలి ప్రాధాన్యం ఇచ్చింది. బడ్జెట్‌లో అత్యధిక నిధులు ఇందుకోసమే కేటాయించింది. రాష్ట్ర శాసనసభలో శనివారం ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆరు గ్యారంటీలపై భరోసా కల్పించేదిగా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికల మేనిఫెస్టోలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇవ్వగా.. ఇప్పటికే రెండింటిని పట్టాలెక్కించింది. ఇందులో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించింది. అలాగే ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచింది. మరో రెండింటి అమలుకు కసరత్తు చేస్తోంది. అందుకు తగ్గట్టే బడ్జెట్‌లో అత్యధిక నిధులు కేటాయించింది. – సాక్షి, కామారెడ్డి

గ్యారంటీలకు పెద్దపీట

- బడ్జెట్‌లో అత్యధిక నిధుల కేటాయింపు
- తొలి విడతలో జిల్లాకు 12,250 ఇళ్లు
- రుణమాఫీపై ఆశలు
- కౌలు రైతులకు రైతుబంధు, రైతుబీమా
- మెగా డీఎస్సీ ప్రకటనతో నిరుద్యోగుల హర్షం
- గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్‌తో ప్రయోజనం

గృహజ్యోతితో 2.30 లక్షల కుటుంబాలకు ప్రయోజనం

రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా రెండు వందల యూనిట్ల లోపు విద్యుత్తు వాడుకునే ఇళ్లకు ఉచితంగా విద్యుత్తు అందిస్తామని ప్రకటించింది. జిల్లాలో 2 వందల యూనిట్ల లోపు విద్యుత్తు వాడుకునే కుటుంబాలు 2.30 లక్షలు ఉన్నాయి. త్వరలో అమలు చేయనున్న ఈ పథకం ద్వారా ఆయా కుటుంబాలకు ప్రయోజనం కలుగనుంది. ఇందుకోసం ఇప్పటికే ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తులు స్వీకరించారు.

రూ. 500లకే గ్యాస్ సిలిండర్

తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారందరికీ రూ. 500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రభుత్వం పేర్కొంది. జిల్లాలో 3.21 లక్షల గ్యాస్ కనెక్షన్లున్నాయి. అయితే 2.53 లక్షల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులున్నాయి. పథకం అమలైతే వారందరికీ ప్రయోజనం చేకూరనుంది. గ్యాస్ సిలిండర్ ధర రూ. వెయ్యి ఉంది. ఒక్కో సిలిండర్‌పై దాదాపు రూ. 500 మేర భారం తగ్గనుంది. ఒక్కో కుటుంబం ఏడాదికి కనీసం ఆరు సిలిండర్లు వినియోగిస్తుంది.

నియోజక వర్గానికి 3,500 ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ. 5లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. తొలి విడతలో ఒక్కో అసెంబ్లీ నియోజక వర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొంది. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజక వర్గాలకు 3,500 చొప్పున ఇళ్లు మంజూరవుతాయి. బాన్సువాడ నియోజక వర్గం రెండు జిల్లాల పరిధిలో ఉండగా కామారెడ్డి జిల్లా పరిధిలో 1,750 ఇళ్లు మంజూరవుతాయి. దీంతో సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న వారికి ప్రయోజనం కలగనుంది.

మెగా డీఎస్సీతో నిరుద్యోగులకు..

ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ నియామకాలు చేపడతామని బడ్జెట్‌లో పేర్కొంది. ఎన్నికలకు ముందు అప్పటి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించినా.. అప్పుడు జిల్లాలో కేవలం 200 పోస్టులే చూయించారు. ప్రస్తుతం మెగా డీఎస్సీ నిర్వహిస్తే పోస్టుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. నిరుద్యోగులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు.

మండలానికో తెలంగాణ పబ్లిక్ స్కూల్

రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక వసతులతో మండలానికో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. జిల్లాలో 25 మండలాలున్నాయి. దీంతో జిల్లాలోని ఆయా మండలాల్లో పబ్లిక్ స్కూళ్లు రానున్నాయి. కార్పొరేట్ తరహాలో పాఠశాలలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాసులు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని ప్రకటించింది.

రుణమాఫీపై ప్రకటన

రూ. 2 లక్షల్లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. గత ప్రభుత్వం రూ. లక్ష వరకు మాఫీ ప్రకటించి కొంతమేర అమలు చేసింది. అలాగే రైతులకు పెట్టుబడి సాయం ఏడాదికి రూ. 15వేలు ఇస్తామని, కౌలు రైతులకు కూడా సాయం అందిస్తామని పేర్కొంది. అలాగే రైతులకు రైతు బీమా కూడా అమలు చేస్తామని ప్రకటించింది. జిల్లాలో 30 వేల పైచిలుకు కౌలు రైతులు ఉన్నట్లు అంచనా.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం



కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం కల్పించింది. ఆర్థిక శాఖమంత్రికి ప్రశంసలు. రూ. 2,75,891 కోట్ల బడ్జెట్‌లో రూ. 98,645 కోట్లు సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం, ఆరు గ్యారంటీల హామీలకు సరిపడా బడ్జెట్ ఇచ్చాం.

– మహమ్మద్ షబ్బీర్ అలీ, ప్రభుత్వ సలహాదారు

వ్యవసాయరంగానికి నిధులు సరిపోవు



కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి, రైతులకు సరిపడా బడ్జెట్‌ను కేటాయించాలి. ఈ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేవలం రూ. 19,746 కోట్లు మాత్రమే కేటాయించారు. రైతు రుణమాఫీ, పంటబీమా, రైతు బీమా తదితర పథకాలకు బడ్జెట్ సరిపోదు. ప్రధానంగా విద్య, వైద్యం, వ్యవసాయం రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సింది.

– కె.వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యే, కామారెడ్డి

అందరికీ మేలు చేకూరేలా..



నాగిరెడ్డిపేట: రాష్ట్రంలో ఆరు గ్యారంటీ పథకాలు వందశాతం అమలయ్యేలా అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఉంది. రైతులకు, వృద్ధులకు, మహిళలకు మేలు చేకూరేలా రూపొందించారు. యువ వికాసం ద్వారా యువతకు ఉపాధి కల్పించే జాబ్ క్యాలెండర్‌ను అమలు చేసేలా బడ్జెట్‌ను తయారు చేశారు.

–మదన్‌మోహన్‌రావు, ఎమ్మెల్యే, ఎల్లారెడ్డి

నిరాశాజనకంగా ఉంది



కొఠారి కమిషన్ సూచించినట్లు విద్యాశాఖకు 30 శాతం నిధులు కేటాయించాలి. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సరిపడా నిధులు ఇస్తే బాగుండేది. నాణ్యమైన భోజనం, అల్పాహారానికి ప్రత్యేక నిధులు కేటాయించాల్సింది. బడ్జెట్ నిరాశాజనకంగా ఉంది.

– అనిల్‌కుమార్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కామారెడ్డి

విద్యారంగానికి అన్యాయం



రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగింది. విద్యా రంగానికి కేవలం 7.8 శాతం నిధులు కేటాయించి చేతులు దులుపుకుంది. కనీసం 15శాతం నిధులు కేటాయించాలి. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు నిధులు ఇవ్వలేదు.

– అరుణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, కామారెడ్డి

గంజాయి విక్రేత అరెస్ట్

- ఒడిశా సరిహద్దులో అదుపులోకి..
- రిమాండ్‌కు తరలింపు



నిందితుడి రిమాండ్ చూపుతున్న దేవునిపల్లి పోలీసులు

కామారెడ్డి క్రైం: కామారెడ్డితో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు లిక్విడ్ గంజాయిని సరఫరా చేస్తున్న ఓ కీలక నిందితుడిని రూరల్ పోలీసులు పట్టుకుని రిమాండ్ చేశారు. ఇందుకోసం కామారెడ్డి నుంచి ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతానికి వెళ్లి ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. నిందితుడు వంతెల ఏసయ్య శుక్రవారం పోలీసులకు చిక్కడంతో శనివారం రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా దేవునిపల్లి ఎస్సై రాజు వివరాలు వెల్లడించారు. దాదాపు 20 రోజుల క్రితం జిల్లా కేంద్రానికి సమీపంలోని క్యాసంపల్లి శివారులో ఏడుగురు యువకులను గంజాయి కేసులో పట్టుకుని వారి వద్ద నుంచి లిక్విడ్ గంజాయి డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. వారిలో ఇద్దరు గంజాయి విక్రేతలు కాగా మరో ఐదుగురు కొనుగోలు చేసి సేవించేవారుగా గుర్తించారు. అసలు గంజాయి ఎక్కడ నుంచి వస్తుంది, ఎవరు సరఫరా చేస్తున్నారనే కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని గ్రామాల నుంచి కామారెడ్డికి లిక్విడ్ రూపంలో గంజాయి సరఫరా జరుగుతున్నట్లు విచారణలో తేలింది. కూపీ లాగిన దేవునిపల్లి పోలీసులు విశ్వసనీయ సమాచారం ద్వారా నిఘా పెట్టారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం గాలిపాడు గ్రామంలో దాడులు చేసి లిక్విడ్ గంజాయి కేసులో ప్రధాన నిందితుడైన ఏసయ్యను అదులోపుకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 270 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని శనివారం రిమాండ్‌కు తరలించామన్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన దేవునిపల్లి ఎస్సై, సిబ్బందిని ఎస్పీ సింధు శర్మ, ఏఎస్పీ నర్సింహా రెడ్డి, డీఎస్పీ ప్రకాశ్ అభినందించారు.

కామారెడ్డి ఆర్డీవోగా రంగనాథ్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి : కామారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారిగా వెయింటింగ్‌లో ఉన్న వై.రంగనాథ్ రెడ్డికి పోస్టింగ్ ఇచ్చారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ రెడ్డిని రెవెన్యూ శాఖలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లాలో పలువురు తహసీల్దార్లు బదిలీ అయ్యారు.

ఆర్థిక సంఘం నిధులపై ఏకగ్రీవ తీర్మానం

కామారెడ్డి అర్బన్: జిల్లాలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనుల కోసం సమావేశమైన జెడ్పీ ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఏకవాక్య తీర్మానంతో ముగిసింది. శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ అధ్యక్షతన కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ హాజరయ్యారు. 15వ ఆర్థిక సంఘం నిధులు జిల్లాకు రూ. 2.90 కోట్లు కేటాయించగా.. వీటిని 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన పనులకు ఖర్చు చేయాల్సి ఉన్నందున జెడ్పీటీసీ సభ్యుల సమావేశం నిర్వహించి తప్పనిసరిగా ఆమోదం తెలపాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ ఆదేశించినట్లు జెడ్పీ సీఈవో సాయాగౌడ్ తెలిపారు. చేపట్టాల్సిన పనులపై సభ్యులు చర్చించాల్సి ఉన్నా.. ఏకవాక్య తీర్మానంతో ఆమోదించారు. టైడ్ గ్రాంట్ రూ. 1.74 కోట్లతో కింద పారిశుధ్యం, తాగునీటి పనులు, అన్‌టైడ్ గ్రాంట్ కింద రూ. 1.16 కోట్లతో పాఠశాలలు, అంగన్‌వాడీ, ఆరోగ్య ఉపకేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం, గ్రంథాలయాలు, మరుగుదొడ్లు, వంటశాలలు, నీటిశుద్ధి(ఆర్‌వో) ప్లాంట్లు, సీసీ రోడ్ల పనులు చేపట్టాలని వైస్ చైర్మన్ ప్రేంకుమార్ ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించారు.



సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ శోభ, కలెక్టర్ జితేష్ వి పాటిల్

పెళ్లి రోజే వెంటాడిన మృత్యువు

- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా రోడ్డుప్రమాదం
- భార్య దుర్మరణం.. భర్తకు తీవ్ర గాయాలు



కూడవెల్లి వాగు వద్ద స్వామిగౌడ్ -నవ్య చివరి సారిగా దిగిన ఫొటో



ప్రమాదం జరిగిన స్థలం ఇదే..

భిక్కనూరు: ఐదు నిమిషాల్లో ఇంటికి చేరి పెళ్లిరోజు వేడుకల్లో పాల్గొనాల్సి ఉండగా మృత్యువు వెంటాడింది. భిక్కనూరులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందడగా, భర్త తీవ్ర గాయాలపాలయ్యాడు. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన జమ్మగొని పేట స్వామి, నవ్య(38) దంపతులు పెళ్లి రోజు సందర్భంగా సిద్దిపేట జిల్లా భూంపల్లి మండలం కూడవెల్లి రాజరాజేశ్వరాలయానికి బైకుపై వెళ్లారు. స్వామివారిని దర్శించుకుని తిరుగుపయనమయ్యారు. జాతీయరహదారి నుంచి భిక్కనూరు చర్చి ప్రాంతం నుంచి మండల కేంద్రంలోకి వస్తుండగా హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కారు వీరి బైకును ఢీకొట్టింది. దీంతో నవ్య రోడ్డుపై పడిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. స్వామిగౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వెంటనే 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక్క కుమారుడు ఉన్నారు. వీరిది ఉమ్మడి కుటుంబం. గ్రామంలో అందరితో కలుపుగోలుగా ఉండేవారు. నవ్య మరణవార్త తెలియగానే గ్రామస్తులు వారి ఇంటి వద్దకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులు, స్థానికులు కంటతడిపెట్టారు.

మనసే జతగా.. మమతే లతగా!

- కమనీయం కల్యాణ బంధం
- నేడు ప్రపంచ వివాహ దినోత్సవం



సాక్షి, కామారెడ్డి: పెళ్లి, లగ్గం, వివాహం, కల్యాణం.. పేరేదైనా ఏడడుగుల బంధంతో ఒక్కటయ్యే ఆడ, మగ కుటుంబ వ్యవస్థకు పునాదులవుతారు. మూడు ముళ్ల బంధంలో ఒదిగి ముచ్చటగా కాపురం చేసి సమాజంలో ఓ భాగమవుతారు. బాధ్యతలను గుర్తుచేసి కుటుంబంలో తమ పాత్ర ఏమిటో తెలియజేసే వివాహ వ్యవస్థకు మన సమాజంలో ఎంతో ప్రాధాన్యం ఉంది. మూడుముళ్ల బంధంతో ఒక్కటై బాధ్యతలు, బాంధవ్యాలు, కర్తవ్యాలను మనకు జ్ఞప్తికి తెచ్చే వివాహం ప్రతిఒక్కరి జీవితంలో కీలకమైన ఘట్టమే. స్త్రీ, పురుషులు ఒకరి తలపై ఒకరు జీలకర్ర బెల్లం పెట్టి, మాంగల్యం తంతునానేనా అనే పురోహితుడి మంత్రోచ్ఛరణతో ఒక్కటయ్యే గొప్పదైన మన భారతీయ వివాహ వ్యవస్థ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచింది. వివాహం భార్య, భర్తలను విడదీయలేని బంధంగా ఉండాలి. ఒకరినొకరు అర్థం చేసుకుని జీవనం సాగిస్తే వందేళ్ల జీవితాన్ని సుఖసంతోషాలతో గడిపేయొచ్చు. మనస్పర్థలు, కోపతాపాలు, అనుమానాలు రేకెత్తకుండా చూసుకోవాలి. కోపతామాలతో నేనే గొప్ప అంటే నేనే గొప్ప అనే అహంకారం, చిన్న చిన్న కారణాలతో కాళ్లపారాణి ఆరకముందే విడాకులు తీసుకుంటున్న ఘటనలు నేటి సమాజంలో చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటి పరిణామాలు లేని స్వచ్ఛమైన ఆదర్శ దాంపత్యం సాగిపోవాలంటే ఒకరినొకరు అరం చేసుకుని ప్రేమానురాగాలు పెంపొందించుకోవాలి. జిల్లా వ్యాప్తంగా ఎన్నో జంటలు ఆదర్శనీయ జీవనం గడుపుతూ నేటి యువతకు స్ఫూర్తిదాతలుగా నిలుస్తున్నారు.

ఎక్కడికైనా కలిసే వెళ్తాం



మాకు 40 ఏళ్ల కిందట పెళ్లయ్యింది. గొర్లు కాయడంతో పాటు వ్యవసాయం చేస్తూ కలిసి జీవనం సాగించాం. జీవాలను తీసేసినం. ఇప్పుడు వ్యవసాయ ఒక్కటే చూసుకుంటున్నాం. మాకు ఇద్దరు కొడుకులు. ఎక్కడికి వెళ్లాల్సి ఉన్నా ఇద్దరం కలిసే వెళ్తాం. భార్య, భర్తలు అన్నపుడు చిన్నచిన్న గొడవలు సహజం. కానీ చిన్నదానికి పెద్దదానికి గొడవ పడితే ప్రయోజనం ఉండందు. కష్టమైనా, సుఖమైనా ఇద్దరు కలిసి ఉంటే ఎదుర్కొనవచ్చు.

–పొదేండ్ల మల్లయ్య, లక్ష్మి
(చుక్కాపూర్, మాచారెడ్డి మండలం)

50 ఏళ్లు గడిచిపోయాయి



మా పెళ్లి 1972 లో జరిగింది. ఈ మధ్యే 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు చేసుకున్నాం. నలుగురు పిల్లలు పెద్దవాళ్లయి, వాళ్ల పిల్లలు కూడా పెరిగి పెద్దయ్యారు. 50 ఏళ్లు గడిచినా మేమిద్దరం అదే ప్రేమ, ఆప్యాయతలతో ఉన్నాం. మా కుటుంబ ఎదుగుదలలో నా భార్య అంజమ్మ సహకారం ఎంతో ఉంది. భార్య, భర్తల మధ్య ప్రేమ, అనురాగాలు పెరుగుతాయే తప్ప తగ్గేవి కాదు.

–ముత్యపు వీరేశలింగం, అంజమ్మ
(ఎల్లారెడ్డి)

ఎన్నో సక్సెస్‌లు సాధించాం



మేమిద్దరం ఇష్టపడి, ఇరు కుటుంబాల అంగీకారంతో పాతికేళ్ల కిందట పెళ్లి చేసుకున్నాం. జీవితంలో ఎన్నో సక్సెస్‌లు సాధించాం. నేను ఫైర్‌మన్ ఉద్యోగం చేస్తుండగా, తను కూడా పెళ్లయ్యాక బీఎడ్, పీజీ పూర్తి చేసింది. టీచర్ ఉద్యోగం సాధించింది. ఇద్దరం కలిసి మెలిసి జీవనం సాగించాం. ఇద్దరు పిల్లలు. పెద్ద అబ్బాయి అమెరికాలో ఉన్నాడు. చిన్నోడు ఇంజినీరింగ్ చదువుతున్నాడు. చిన్న వయసులోనే పెళ్లయినా, ఇద్దరం అన్యోన్యంగా ఉంటూ ఇక్కడిదాకా వచ్చాం. సర్దుకుపోయే మనస్తత్వం ఉంటే ఎన్ని కష్టాలు ఎదురైనా అధిగమించవచ్చు.

–పొంద్రి వినోద్‌కుమార్, రాజ్యలక్ష్మి (ఎల్లారెడ్డి)

ఆరున్నర దశాబ్దాల వైవాహిక జీవితం



మాకు 1959 మే 30న పెళ్లయ్యింది. దాదాపు 65 ఏళ్లవుతుంది. మాకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. వాళ్ల పిల్లల పెళ్లిళ్లు కూడా అయ్యాయి. మాది వ్యవసాయ కుటుంబం. ఇప్పటికీ పొలం దగ్గరకు రోజూ వెళ్తాం. బీపీ, షుగర్ వంటి సమస్యలేవీ మా దరి చేరలేదు. దీనికి కారణం మేమిద్దరం నాటి నుంచి నేటి దాకా కష్టపడి పనిచేయడమే. ఆరున్నర దశాబ్దాల వైవాహిక జీవితంలో మా మధ్య ఎలాంటి పొరపొచ్చాలకు తావులేదు. నేటి తరం పిల్లలు చిన్న చిన్న వాటికే గొడవలు పడుతున్నారు. ఒకరినొకరు అర్థం చేసుకుంటే ఇబ్బందులు రావు.

–నిట్టూరి కిషన్‌రావ్, శాంతాబాయి, అంతంపల్లి

అర్థం చేసుకుంటేనే జీవితానికి పరమార్థం



మాకు 1977 మార్చి 31న వివాహం జరిగింది. నాలుగున్నర దశాబ్దాల వైవాహిక జీవితంలో ఏనాడూ గొడవలు పడింది లేదు. ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు. పిల్లలంతా సెటిల్ అయ్యారు. వ్యాపారంలో ఎంత బిజీ ఉన్నా కుటుంబానికి సమయం కేటాయించడం ద్వారా ఒకరినొకరు అర్థం చేసుకున్నాం. చిన్న చిన్న విషయాలకు కోపం తెచ్చుకోవడం, ద్వేషించుకోవడం వల్ల ఇబ్బందుల్లో పడతారు. అందుకే కలిసిమెలసి ఉండే ప్రయత్నం చేయాలి. మన వివాహ వ్యవస్థ ఎంతో గొప్పది.

–పార్శి రాజేందర్, లక్ష్మి (కామారెడ్డి)

సామరస్య ధోరణి ఉండాలి



మా వివాహం 1985 మే 10న జరిగింది. మాకిద్దరు పిల్లలు. మా బాబు అభినవ చతుర్వేది పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో సీఐగా, కూతురు సింధు క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్‌గా ఉద్యోగాలు చేస్తున్నారు. మేమిద్దరం ఉపాధ్యాయులం. పెళ్లయ్యాకే మా ఆవిడ దేవికారాణి ఉద్యోగం సాధించారు. అంతకుముందే నేను ఉద్యోగం చేస్తున్నాను. ఇద్దరి మధ్య సామరస్య ధోరణి ఉంటే సంసారంలో ఇబ్బందులు తలెత్తవు. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ముందుకు సాగితే జీవితం సంతోషంగా సాగుతుంది.

–గాజుల రాజులు, దేవికారాణి (బాన్సువాడ)

క్లుప్తంగా

సీపీఎస్‌ను రద్దు చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ఉపాధ్యాయులు లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో ప్లకార్డులు ప్రదర్శించారు. శనివారం కాంప్లెక్స్ సమావేశాల్లో భాగంగా విరామ సమయంలో ప్లకార్డులు ప్రదర్శించారు. ఎన్నికల సమయంలో సీపీఎస్‌ను రద్దు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, వెంటనే ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. టీచర్లు వహీద్‌సిద్దిఖీ, మహిపాల్, దామోదర్, సంజీవులు, శ్రీనివాస్, సత్యం, రాములు తదితరులున్నారు.

కస్తూర్బా విద్యార్థినులకు అభినందన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ఇటీవల యాదాద్రి భువనగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొని ఉత్తమప్రతిభ చూపిన నాగిరెడ్డిపేట కస్తూర్బా పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు ఎస్.అంజలి, ఎస్.అర్చనను శనివారం పాఠశాల ప్రత్యేకాధికారిణి వీణతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు. గతనెల 31న కామారెడ్డిలో నిర్వహించిన జిల్లా జట్టు ఎంపికలో అంజలి, అర్చన ఉత్తమప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి రగ్బీ జట్టులో చోటు సంపాదించారు. ఈ సందర్భంగా పీఈటీ శోభను వారు అభినందించారు.

మరుగుదొడ్లను వినియోగించాలి



బాన్సువాడ రూరల్ : గ్రామాల్లో లబ్ధిదారులు నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్లను వృథాగా ఉంచకుండా, వినియోగించాలని మండల కార్యాలయ సూపరింటెండెంట్ ముజాహిద్ అన్నారు. శనివారం ఆయన బాన్సువాడలోని శశాంక్ డిగ్రీకళాశాల ఆధ్వర్యంలో కొయ్యగుట్ట తండాలో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరానికి హాజరై మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గుజ్జరి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రాహేలాబేగం, అధ్యాపకులు తదితరులున్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. శుక్రవారం నాటికి 2లక్షల 76వేల136 మెట్రిక్ టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

మిశ్రమ స్పందన

సాక్షి నెట్‌వర్క్ : రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లావాసులు మిశ్రమ స్పందన వ్యక్తం చేశారు. విద్యారంగానికి బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించారంటూ విద్యార్థి సంఘాల నాయకులు నిరాశ చెందారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రతిపాదించడాన్ని మేధావులు స్వాగతించారు. బీసీలకు తక్కువ నిధులు కేటాయించారని బీసీ సంఘాల నాయకులు ఆరోపించారు. వ్యవసాయానికి ప్రాధాన్యం కల్పించారని పలువురు రైతు సంఘాల నాయకులు పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో ఫసల్ బీమాను అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

గురుకుల భవనాలు నిర్మించాలి



కామారెడ్డి అర్బన్: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ గురుకులాలకు సొంత భవనాల నిర్మాణానికి రూ. 1,546 కోట్లు, ఎస్సీ గురుకులాలకు రూ. వెయ్యి కోట్లు, ఎస్టీ గురుకులాలకు రూ.1,002 కోట్లు కేటాయించడం హర్షనీయం. బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాల భవనాల నిర్మాణానికి వెంటనే టెండర్లు పిలిచి ఆరునెలల్లో పనులు పూర్తి చేయాలి.

– కావేటి వేణుగోపాల్, పూర్వ అధ్యక్షుడు, ఏపీటీఎఫ్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్

సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చారు



దోమకొండ : ప్రభుత్వం బడ్జెట్‌లో సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు. సంక్షేమ కార్యక్రమాలను నిధులను కేటాయించారు. దీనివల్ల పేద మధ్య తరగతి వారికి ఉపయోగపడే విధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్ ఇవ్వడానికి నిర్ణయించి బడ్జెట్‌లో నిధులు కేటాయించడం అభినందనీయం.

– సామల నర్సింలు, వ్యాపారి, దోమకొండ

రాష్ట్ర పునర్నిర్మాణానికి దిక్సూచి బడ్జెట్



నిజాంసాగర్(జుక్కల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొట్ట మొదటి బడ్జెట్ రాష్ట్ర పునర్నిర్మాణానికి దిక్సూచి. ఈ బడ్జెట్ ప్రగతిశీల, పేదల సంక్షేమానికి అనుకూలమైనది. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు, హామీలు అమలు చేస్తూ సంపూర్ణ రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం బాటలు వేసింది. మా ప్రభుత్వం నిత్య కార్యకలాపాలు, అనవసర ఖర్చులను తగ్గించి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పెట్టుబడులకు ప్రాధాన్యతనిచ్చింది. ఆరుగ్యారంటీల అమలు రూ. 53,196 కోట్లు కేటాయించింది.

– తోట లక్ష్మీకాంతారావు, ఎమ్మెల్యే జుక్కల్

రైతులకు అన్యాయం



బిచ్కుంద(జుక్కల్) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో రైతులకు అన్యాయం జరిగింది. పంట పెట్టుబడి కోసం రైతుబంధు రైతులకు అందకుండా పోతుంది. పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడుతోందని రైతుల్లో అసంతృప్తి ఉంది. అలాగే బీసీ, మైనార్టీ ఇతర వర్గాలకు ఈ బడ్జెట్‌తో ఒరిగిందేమి లేదు పెరుగుతున్న జనాభా ప్రాతిపదికన ఈ బడ్జెట్ ఏమాత్రం సరిపోదు.

– హన్మాండ్లు, ఖద్గాం

విద్యారంగంపై నిర్లక్ష్యం



కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి కేవలం 11.3% నిధులు మాత్రమే కేటాయించింది. విద్యారంగం బాగుపడాలంటే కనీసం 30% నిధులు కేటాయించాలి. కానీ నేటి బడ్జెట్‌లో అరకొరా నిధులు కేటాయించడం చూస్తే కాంగ్రెస్ సర్కారు కూడా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని అర్థమవుతుంది. వెంటనే బడ్జెట్‌ను సవరించి అధిక నిధులు కేటాయించాలి.

– రాజేశ్వర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి, నిజామాబాద్

ఉర్దూ సాహిత్యం మధురమైంది

కలెక్టర్ జితేష్ వి పాటిల్

దోమకొండ: ఉర్దూ సాహిత్యం మధురమైందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం దోమకొండలోని గడికోటలో నిర్వహించిన ఉర్దూ కవి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఉర్దూ సాహిత్య అభివృద్ధి కోసం ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో సంస్థానాలను పాలించిన వారు సాహిత్య అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. నేటి తరానికి పాత జ్ఞాపకాలను అందించిన ఘనత కవులకే దక్కుతుందన్నారు.

తెలంగాణ ఉర్దూ సాహిత్యం దేశానికి రప్పించాలి

తెలంగాణ ఉర్దూ సాహిత్యం పాకిస్తాన్‌లో ఉందని, దానిని తిరిగి స్వదేశానికి రప్పించాలని ఉర్దూ కవులు ఈ సందర్భంగా కోరారు. వందలాది పుస్తకాలు అక్కడే ఉన్నాయని.. వాటిని తిరిగి తెలంగాణకు రప్పించాలన్నారు. దోమకొండ మాజీ పాలకులు రాజ రాజేశ్వర్‌రావు రచించిన వంద పుస్తకాలు పాకిస్తాన్‌లో ఉన్నాయన్నారు. 500 ఏళ్ల మన పాలకుల చరిత్ర సాహిత్యం నేటి విద్యార్థులకు దిక్సూచిగా ఉంటుందన్నారు. భవిష్యత్ తరాలకు దానిని అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గడికోట వారసులు కామినేని అనిల్ కుమార్, అపోలో ఆస్పత్రుల డైరెక్టర్ కామినేని శోభన, తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం బోర్డు చైర్మన్ మహమ్మద్ అబ్దుల్లా కవి, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ హెడ్ డిపార్ట్‌మెంట్ మాజీద్ బేదర్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి ఉర్దూ కవి సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

డ్రైవింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి



ఎల్లారెడ్డి : వాహనాలను నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని డీటీవో వాణి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డి పోలీసు శాఖ ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లకు, వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనాన్ని నడిపే సమయంలో కుటుంబం కంటే ముందు మిమ్మల్ని మీరు ప్రేమించుకోవాలన్నారు. జీవితంలో ఒక్కసారి పోలీసు కేసు నమోదైతే ప్రభుత్వ ఉద్యోగాన్ని కోల్పోతారని ప్రతి యువకుడు ఇది గుర్తించుకోవాలన్నారు. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ రోడ్డుపై ప్రమాదాలు జరిగిన సమయంలో గోల్డెన్ అవర్‌లో భాగంగా బాధితులను దగ్గర్లోని ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాణాలు కాపాడాలన్నారు. పోలీసులు ఇబ్బంది పెట్టరన్నారు. ఎంవీఐ శంకర్ నారాయణ, ఆర్టీవో మన్నె ప్రభాకర్, సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేష్, ఏఎంవీఐ విద్యాధర్‌రావు, తహసిల్దార్ మహేందర్‌కుమార్, వైద్యుడు ఉపేందర్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో కౌన్సిలర్, కో–ఆప్షన్ సభ్యుడి చేరిక

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్‌లో బీఆర్ఎస్ పార్టీకి వరుసగా షాక్‌లు తగులుతున్నారు. ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఒక్కొక్కరుగా రాజీనామా చేస్తూ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటున్నారు. తాజాగా శనివారం 41వ వార్డు కౌన్సిలర్ కాళ్ల రాజమణి, ఆమె భర్త మాజీ కౌన్సిలర్ గణేశ్‌తో పాటు మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు మసూద్ అలీలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరి చేరికతో ప్రస్తుతం మున్సిపల్‌లో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 19కి చేరుకుంది. అధికార చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. మరో ఆరుగురు సైతం కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అధికార చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలంటే 26 మంది సభ్యులు కావాల్సి ఉంటుంది. అవిశ్వాసం కోసం కాంగ్రెస్‌కు మరో ఏడుగురు సభ్యులు అవసరం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరిన వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు 30 మంది నెల రోజుల క్రితం అవిశ్వాసం పెట్టేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్న విషయం తెలిసిందే. కానీ కౌన్సిలర్లు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతుండడంతో బీఆర్ఎస్ వెనక్కి తగ్గినట్లు తెలిసింది. కౌన్సిల్ కాల పరిమితి మరో 11 నెలలే ఉన్నా కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసం వైపే మొగ్గు చూపుతోంది.



కాంగ్రెస్‌లో చేరిన ప్రజాప్రతినిధులతో షబ్బీర్‌అలీ

గ్రామాల్లోనూ ఆర్ఎస్ఎస్ శాఖలు ప్రారంభించాలి

- జిల్లా ప్రముఖ్ సాయినాథ్

భిక్కనూరు : దేశసంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకు అన్ని గ్రామాల్లో ఆర్ఎస్ఎస్ శాఖలను ఏర్పాటు చేయాలని ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రముఖ్ సాయినాథ్ అన్నారు. శనివారం భిక్కనూరు మండల కేంద్రంలో నిర్వహించిన శ్రీరామదండు ప్రతినిధుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్ని గ్రామాల్లో ఆర్ఎస్ఎస్ శాఖలు ప్రారంభమైతే హిందూ సమాజాన్ని సంఘటితంగా చేసుకోవడంతో బాటు, అన్ని గ్రామాలన్నీ రామరాజ్యంగా వెలసిల్లుతాయన్నారు. బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి సందుగారి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ లవ్ జిహదీలను అరికట్టాలని, అందుకు హిందువులంతా జాగృతం కావాలని లేకుంటే భవిష్యత్తులో హిందు సమాజం ప్రమాదంలో పడుతుందన్నారు. దేశ హితం కోసం రైతులంగా బీకేఎస్‌లో చేరాలని కార్మికులు బీఎంఎస్‌లో చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామదండు పట్టణాధ్యక్షుడు చల్ల లక్ష్మణ్, ప్రతినిధులు, సామల భగీరథ, పబ్బ కిరన్, తమ్మల సాయికుమార్, గొల్ల రమేష్, పెద్దబచ్చగారి సాయిరణ్‌రెడ్డి తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రముఖ్ సాయినాథ్

మార్ఫింగ్ చేసి రూ. 7 లక్షల లోన్ నొక్కేశారు

- హైదరాబాద్ బిట్స్ పిలాని క్యాంపస్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో వ్యవహారం
- ఇసన్నపల్లికు చెందిన గొర్రెల కాపరికి ఇబ్బందులు
- గతంలో కామారెడ్డిలో పర్స్ పోగొట్టుకున్న బాధితుడు

రామారెడ్డి(ఎల్లారెడ్డి): పర్స్ పోగొట్టుకోవడం.. అందులో డూప్లికేట్ ఆధార్, ఓటర్, పాన్ కార్డులు ఉండటం.. గొర్ల కాపరైన కన్నపురం బాలమల్లును చిక్కుల్లో పడేసింది. ఆయన ఫొటోను మార్ఫింగ్ చేసి గుర్తు తెలియని వ్యక్తి, బ్యాంక్ సిబ్బంది కుమ్మక్కై వ్యక్తిగత లోన్ తీసుకున్నారు. ఫలితంగా ప్రస్తుతం బాలమల్లుకు బ్యాంకు నోటీసులు వస్తున్నాయి. వివరాల్లోకెళ్తే.. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం ఇసన్నపల్లి గ్రామానికి చెందిన కన్నపురం బాలమల్లు గొర్ల కాపరి. 2019లో కామారెడ్డికి పనిమీద వెళ్లినప్పుడు జేబులో ఉన్న పర్సును పోగొట్టుకున్నాడు. బాలమల్లు పర్సులో డూప్లికేట్ ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, ఎలక్షన్ కార్డు, రూ. 100 నగదు ఉన్నాయి. కార్డులన్నీ డూప్లికేట్‌వి కావడంతో బాలమల్లు పెద్దగా పట్టించుకోలేదు. 2021లో హైదరాబాద్ ఎస్‌బీఐ జవహర్‌నగర్ శాఖ నుంచి ఆయనకు నోటీసు వచ్చింది. బాలమల్లు రూ. 7 లక్షల వ్యక్తిగత లోన్ 2019లో తీసుకుని వాయిదాలను చెల్లించడం లేదని 2021లో నోటీసును జారీ చేశారు. తాను తీసుకోని లోన్‌పై నోటీసులు రావడంతో బాలమల్లు అవాక్కయ్యాడు. పైగా బ్యాంకు రికవరీ సిబ్బంది ఫోన్లు చేయడం మొదలుపెట్టారు. దీంతో బాలమల్లు తెలిసిన వారిని తీసుకొని సదరు బ్యాంకు శాఖకు వెళ్లారు. ఆ శాఖలోని ఫైల్స్ అన్ని తీయించగా బాలమల్లుకు సంబంధించిన డూప్లికేట్ ఆధార్ కార్డ్, పాన్‌కార్డు ఎలక్షన్ కార్డులపై గుర్తుతెలియని వ్యక్తి ఫోటోలు మార్ఫింగ్ చేసి, బ్యాంక్ అధికారులతో కుమ్మక్కై 7 లక్షల లోన్ తీసుకున్నట్లు తేలింది.

ఎడ్యుకేషన్ కోసం ఇచ్చే లోన్లు..

హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ కీసర రోడ్డులో షామీర్‌పేట ప్రాంతంలో గల బిట్స్ పిలాని క్యాంపస్ లోపల ఎస్‌బీఐ బ్రాంచ్‌లో కేవలం ఎడ్యుకేషన్ లోన్లు మాత్రమే ఇస్తామని బ్యాంకు మేనేజర్ బిపుల్ కుమార్‌దాస్ తెలిపారు. అయితే ఆ బ్యాంకులో గతంలో పనిచేసిన మేనేజరు కుమ్మక్కై బాలమల్లు కార్డులపై మరో వ్యక్తికి వ్యక్తిగత లోన్ మంజూరు చేసినట్లుగా బ్యాంక్ అధికారులే అంగీకరించారు. కేసును కోర్టుకు అప్పగించామని, లాయర్‌తో మాట్లాడి బాలమల్లు పేర్లు తొలగిస్తామని బ్యాంక్ అధికారులు చెప్తున్నారు. అయితే గొర్లు కాసుకునే బాలమల్లు మిత్తితో కలిపి 12 లక్షలు అప్పును కట్టాల్సి వస్తుందని ఆవేదనతో ఎన్నోసార్లు హైదరాబాద్ జవహర్ నగర్ బ్యాంకుకు తెలిసిన వారిని తీసుకెళ్లి వ్యయ ప్రయాసలను భరించి అనేక ఇబ్బందులు పడుతూనే ఉన్నాడు. తప్పుడు లోన్లు తీసుకున్న వారిపై ఇచ్చిన వారిపై కేసు నమోదు చేయకుండా, మళ్లీ బ్యాంకుకు రావాలని తమ శాఖకు సంబంధించిన లాయర్‌తో మాట్లాడుకోవాలని బ్యాంకు అధికారులు సూచిస్తున్నారు. కాగా బ్యాంకు నుంచి లోన్ తాలుకు డబ్బులు చెల్లించాలని బాలమల్లుకు ఫోన్లు వస్తూనే ఉన్నాయి.

కొనసాగుతున్న 'లగ్గం' షూటింగ్

బీబీపేట : మండలంలోని జనగామ గ్రామానికి చెందిన పారిశ్రామిక వేత్త, కాంగ్రెస్ నాయకుడు తిమ్మయ్యగారి వేణుగోపాల్‌రెడ్డి ప్రొడ్యూసర్‌గా తెరకెక్కనున్న 'లగ్గం' సినిమా షూటింగ్ మండలంలోని ఇస్సానగర్‌లో శనివారం నిర్వహించారు. నాలుగు రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో వివిధ ప్రదేశాల్లో షూటింగ్ నిర్వహిస్తున్నారు.



సాక్షి సండే క్లాసిఫైడ్స్

క్రైం కార్నర్

బాల్కొండలో కత్తిపోట్ల కలకలం

- పాత కక్షలతో ఒకరిపై దాడి
- కేసు నమోదు చేసిన పోలీసులు





కత్తిపోట్లకు గురైన రఫీక్, హోటల్ వద్ద గుమిగూడిన స్థానికులు

బాల్కొండ: మండల కేంద్రంలోని ఓ హోటల్‌లో టీ తాగుతున్న వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కత్తితో శనివారం దాడి చేయడంతో కలకలం రేగింది. ఎస్సై గోపి తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన రఫీక్ వన్నెల్(బి) చౌరస్తాలోని ఓ హోటల్ వద్ద టీ తాగుతుండగా, అదే గ్రామానికి చెందిన అన్నదమ్ములు సయ్యద్ సోఫియాన్, సయ్యద్ రియాన్‌లు పాత కక్షలను మనుసులో పెట్టుకుని అతడిపై కత్తితో దాడి చేశారు. రఫీక్ తప్పించుకోవడానికి యత్నించగా చేతులకు, ఇతర చోట్ల గాయాలయ్యాయి. వీరిని అడ్డుకోవడానికి వెళ్లిన అతారొద్దీన్‌కు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. కేసు నమోదు చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లిసంగారెడ్డిలో అక్టోబర్ 11న జరిగిన గ్రామానికి చెందిన మద్దెల కమలవ్వ అనే వృద్ధురాలి హత్య కేసును పోలీసులు చేధించారు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు శనివారం వివరాలను వెల్లడించారు. శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన మద్దెల కమలవ్వ తన ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. గుర్తు తెలియని వ్యక్తి రాత్రి వేళ ఇంట్లోకి ప్రవేశించి కమలవ్వను గొంతు నులిమి హత్య చేశారు. మృతురాలి మెడలో ఉన్న బంగారు గొలుసు, చెవి కమ్మలు అపహరించుకెళ్లాడు. పోలీసులు విచారణ చేపట్టగా.. అదే గ్రామానికి చెందిన పర్కాల రాజుపై అనుమానం వ్యక్తం చేశారు. అతడు పరారీలో ఉండగా, శనివారం శెట్పల్లిచౌరస్తాలో పట్టుకొని విచారణ చేశారు. హత్యానేరాన్ని అతడు అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కేసును చేధించిన సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి, సిబ్బంది రాజు, లిక్యానాయక్‌లను డీఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

మొరం ట్రాక్టర్లు, జేసీబీ పట్టివేత



బిచ్కుంద(జుక్కల్): మండలంలోని రాజుల్లా గ్రామ శివారులో శనివారం అక్రమంగా మొరం తవ్వి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లను రెవెన్యూ, పోలీసులు పట్టుకున్నారు. బిచ్కుంద, రాజుల్లా, గోపన్‌పల్లి ఆయా గ్రామాలలో జరుగుతున్న మొరం అక్రమ వ్యాపారంపై ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సహకారంతో ఆర్ఐ రవీంధర్ తవ్వకాల వద్దకు చేరుకొని ఒక జేసీబీ, నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నారు. రాజకీయ నాయకుల ఫోన్లు రావడంతో అక్కడ ఉన్న ఎనిమిది ట్రాక్టర్లను వదిలేసి నాలుగు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నామా మాత్రపు జరిమానా విధించకుండా వాల్టా చట్టం కింద కేసు నమోదు చేయాలని గ్రామస్తులు అధికారులకు డిమాండ్ చేశారు. పైఅధికారులతో మాట్లాడి కేసు మోదు చేస్తామని అధికారులు తెలిపారు.

బాలిక కిడ్నాప్‌కు యత్నం

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఎంఎస్‌సీ ఫారంలో ఓ బాలికను గుర్తు తెలియని దుండగులు కిడ్నాప్‌కు యత్నించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ప్రీతి జైతాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. శుక్రవారం సాయంత్రం బడి నుంచి ఎమ్మెస్సీ ఫారంకు కాలినడకన ఒంటరిగా బయలుదేరింది. గ్రామ సమీపాన వ్యాన్ ఆపిన గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు బాలికకు చాక్లెట్ ఇవ్వగా, నిరాకరించి ముందుకు నడిచింది. వారు బాలికను వెంబడిస్తుండగా, గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కనబడడంతో వ్యక్తి దగ్గరికి వెళ్లింది. వెంటనే ఆ వ్యక్తికి జరిగిన విషయం చెప్పడంతో దుండగులు పారిపోయారు. ఆ వ్యక్తి బాలికను ఇంటి వద్ద దింపేశాడు. ఈ ఘటనతో ఎంఎస్సీ ఫారం, జైతాపూర్ గ్రామస్తులు అప్రమత్తమయ్యారు.

మహిళ అదృశ్యం..



బాలమణి (ఫైల్)

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని పాంచ్‌రస్తా ప్రాంతంలో నివాసం ఉండే ఓ మహిళ అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. కాలనీకి చెందిన హనుమాండ్ల బాలమణి అనే మహిళ ఆస్తి విషయంలో గొడవల కారణంగా ఉదయం ఇంటి నుంచి వెళ్ళిపోయింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ దొరకలేదు. ఆమె కొడుకు రాము సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పనికి వెళ్లలేదని నిలదీసిన భార్య: భర్త ఆత్మహత్య



సందీప్ మృతదేహం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పనికి ఎందుకు వెళ్లలేదని భార్య ప్రశ్నించినందుకు మనస్థాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన రాంబాలు సందీప్(29) కొంతకాలంగా మతిస్థిమితం లేకపోవడంతో చాలాసార్లు ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయి, తిరిగి వచ్చాడు. శనివారం ఉదయం కూలి పనికి ఎందుకు వెళ్లలేదని భార్య రచన ప్రశ్నించడంతో ఇరువురు గొడవపడ్డారు. ఆవేశానికి గురైన సందీప్ ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్సై రాజు పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత..

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని ఖండ్‌గావ్‌కు చెందిన వివాహిత మనీషా (26) శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ శనివారం తెలిపారు. ఈ ఘటనపై మృతురాలు అనారోగ్య సమస్యతో (కడుపునొప్పి) బాధపడుతూ ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి రాజు (మహారాష్ట్ర) ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి భర్త, కూతురు, కొడుకు ఉన్నారు.

గేదెల వాహనాన్ని ఢీకొన్న కారు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారం గ్రామశివారులోని మూలమలుపు వద్ద రెండు గేదెలతో వెళ్తున్న బోలెరో వాహనాన్ని శనివారం ఓ కారు ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనంలోని గేదెలకు తీవ్రగాయాలయ్యాయి. మెదక్ జిల్లా హవేలీ ఘణపూర్ మండలం ముత్తాయిపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు నిజామాబాద్ జిల్లా సాటాపూర్ పశువుల సంతలో రెండు గేదెలను కొనుగోలు చేసుకొని బోలెరో వాహనంలో తన స్వగ్రామానికి బయల్దేరాడు. కాగా సదరు వాహనాన్ని మెదక్ వైపు నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బోలెరోతోపాటు కారు ముందుభాగం ధ్వంసం కాగా బోలెరోలోని గేదెలకు తీవ్రగాయాలయ్యాయి. బోలెరో డ్రైవర్ మహ్మద్ సాజిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

పోలీసులకు అనుమానితుల అప్పగింత

కామారెడ్డి క్రైం: పట్టణంలోని పెద్దబజార్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా.. కాలనీలో కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో స్థానికులు వారిని ప్రశ్నించడంతో పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో వారిని కిడ్నాపర్లుగా భావించి స్థానికులు పట్టుకునేందుకు యత్నించగా, పారిపోయారు. వారిలో ఇద్దరు దొరుకగా పోలీసులకు అప్పగించారు. విచారణలో వాళ్లు తాడ్వాయికి చెందిన బక్కోళ్ళ భూమయ్య, కీసరి రాజవ్వగా తెలిసింది. దారి మరిచిపోయి కాలనీకి వచ్చామన్నారు. వారు పిల్లలను ఎత్తుకుపోయే వ్యక్తులు కాదని, ప్రజలు ఆందోళన చెందవద్దని ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

మిస్సింగ్ కేసు ఛేదన

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని అంజని గ్రామానికి చెందిన బర్దావల్ బహదూర్ సింగ్ అదృశ్యమైనట్లు జనవరి 23న అతడి కుటుంబ సభ్యులు స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అతడి కోసం గాలించగా పూణెలో ఉన్నట్లు సమాచారం అందింది. వెంటనే వారు అక్కడికి వెళ్లి అతడి ని స్వగ్రామానికి తీసుకొచ్చి శనివారం కుటుంబీకులకు అప్పగించారు. ఎస్సై కోనారెడ్డి తదితరులు ఉన్నారు.

క్రేన్ ఢీకొని ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లి చౌరస్తాలో అదే గ్రామానికి చెందిన సయ్యద్ మౌలానా(60) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు క్రేన్ ఢీకొని మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.